# మరో నేను



మేమిద్దరం చాలాకాలం ఒకే గదిలో కలిసి వున్నాం. రాత్రుళ్ళు నిద్రరాక రైల్వేస్టేషన్‌కి పహరా కాశాం. సిగరెట్ కొసల్ని మెరిపిస్తూ సందు గొందుల్లో తచ్చాడాం. ఐతేనేం నాకు కంచినాథం గురించి తెలిసింది శూన్యం.

నేను చాలా ఎక్కువగా మాట్లాడ్తాను. దాచుకొనేదేమీ వుండదు. కష్టాలు వస్తే కన్నీళ్ళు పెట్టుకుంటూ . కానీ కంచినాథం సంగతి వేరు. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూండే కంచినాథం ఒక్కసారిగా గంభీరంగా ఐపోయేవాడు. సిగరెట్‌ని వెలిగించి పొగ వదులుతూ, భారంగా నిట్టూరుస్తూ నడిచేవాడు.

"ఏమిటలా వున్నావ్! ఏమైంది" అని కదిలిస్తే

"ఏమీ లేదు" అనేవాడు సిగరెట్‌ని నేలకేసి కొట్టి కసిగా నలుపుతూ.

ఐతే 'యిదీ నా సమస్య' అని వాడెప్పుడూ చెప్పలేదు. కంచినాథం గురించి స్మృతి ఏం మిగిలింది? సిగరెట్‌ని విలాసంగా వెలిగించడం, నేలకేసి కొట్టి కాలితో నలిపేయడం తప్ప. అందులోనే ఏదో గుండెను కోసే రహస్యం వుందనిపించేది. ఎగసి పడ్తున్న బాధనో కసినో అలా నొక్కి పెడ్తున్నాడనిపించేది.

నలుగురు మిత్రులం కలిసి బాల్యాన్ని బడిని యింటిని తలచుకొంటున్నప్పుడు కూడ కంచినాథం మౌనంగానే వుండేవాడు. అదే మౌనం, సిగరెట్టు కాల్తున్న మౌనం, చెప్పు కింద నలుగుతున్న సిగరెట్, గర్భంలోనే మరణించిన మాటలు...తన యింటి సంగతి కాని చిరునామా కాని ఎప్పుడూ చెప్పలేదు. ప్రసక్తి వచ్చినా దాటేసేవాడు. జీవితానికి సంబంధించిన ఏ ప్రసక్తి వచ్చినా 'టచ్‌మినాట్' ఐపోయేవాడు. ఎవ్వరితోనైనా నిమిషంలో మాటలు కలిపేవాడు. ఎవర్నయినా ఆప్యాయంగా పలకరించేవాడు. కాని ఇదంతా డ్రామా అనిపించేది. అతని అసలు స్వరూపం కాలికింద నలుగుతున్న సిగరెట్, గంభీరమైన ముఖం వెనుక వురుముతూ వర్షించని మేఘం.

ఆ రోజు రాత్రి కంచినాథం ఏమీ మాట్లాడలేదు. పడుకోబోయే ముందు నేను కాలక్షేపం కోసం మొదలెట్టిన సంభాషణని రోజులా కొనసాగించలేదు. సిగరెట్ కాలుస్తూ పై కప్పు వంక చూస్తూ పడుకొన్నాడు. అతని రెప్పలు వాలని చూపులకి పై కప్పు చిల్లు పడ్తుందేమోననిపించింది.

"ఏం అలా వున్నావ్?" "ఏం లేదు" అనే మా చివరి మాటలు.

పొద్దుటే లేచి చూస్తే లేడు. అతని సూట్ కేస్ కూడా లేదు. అసలతని గుర్తేదీ గదిలో మిగల్లేదు. అయ్యో ఏమైపోయావ్ కంచినాథం ఎక్కడికెళ్ళావ్ ఒక్క మాటైనా చెప్పకుండా! నన్నేదో అపరాధ భావం పీడించింది. అతనిని కదిలించి లోపలి విషాదాన్ని కక్కించలేక పోయానని, ఏ మాత్రం సానుభూతిని స్నేహాన్ని అందించలేక పోయానని, ఇక్కడ ప్రతివాడు పక్కవాడి పట్ల యిలాంటి అశ్రద్ధే చూపిస్తున్నాడని భయమేసింది.

కంచినాథం అదృశ్యంతో ఏదీ తలకిందులు కాలేదు. ఎవరూ పలవరించలేదు. "వాళ్ళూ రెళ్ళుంటాడు వచ్చేస్తాడులే. అంత ఆదుర్దాగా వుంటే లెటర్ రాయి" సలహా పారేశాడొకడు. అసలతని అడ్రస్ తెలిస్తే కదా? ఆదుర్దా పెరుగుతోంది. ఆందోళన పెరుగుతోంది. అయ్యో! ఎక్కడికి పోయావ్! అలా అదృశ్యమై పోయావ్ కంచినాథం నీరావిరై కరిగినట్లు! ఎన్నో మొహాల్ని రోజూ చూస్తూనే వున్నాను. ఏ ముఖమైనా...? ప్చ్. లాభం లేదు.

రోజులు గడచి పోతున్నాయి. అతని దగ్గర్నుంచి లెటరైనా వస్తుందని రోజూ ఎదురు చూపే. ఆఫీసు నుంచి వచ్చి గదిలోపల ఒంటరిగా శూన్యంలో వేళ్ళాడ్తున్నప్పుడు అనుకొనేవాణ్ణి. "కనీసం కంచినాథం వున్నా ఎంత బాగుణ్ణు" తిరిగి వస్తాడన్న ఆశ రోజు రోజుకీ తరిగి పోతోంది. నగరంలోని గదిలోకి ప్రవేశిస్తున్నప్పుడు దిగులూ భయం, శవ పేటికలోకి వెళ్తున్నట్టు. కంచినాథం లేని గది, ఎవరూ తోడులేని గది, దిక్కులేని గది, రోదసిలోని గది, యీ గదికి తోడు కావాలి.

రోజులు గడుస్తున్నాయి. అలాగే ఆ ఒంటరి గదిలో. పేపర్లో గుర్తు తెలియని శవాల గురించి చదివినప్పుడు వెళ్ళి తెలుసుకోవాలనిపించేది. కాని భయం. కంచినాథం ఊహల్లో కూడ లేకుండా పోతే? ఎన్‌కౌంటర్ మృతిని గురించి విన్నా యిదే భయం. ఏమో అదృశ్య శత్రువుపై ప్రతీకార భావం ఎవర్నెక్కడికి చేరుస్తుందో?

గది శూన్యంలో వేళ్ళాడ్తోంది. రైళ్ళూ బస్సులూ వస్తున్నాయి, పోతున్నాయి. ఎందరో ఆగంతకులు, కాని వారిలో కంచినాథం లేడు. రోజూ ఉత్తరాలు వస్తున్నాయి. కాని కంచినాథం నుంచి కాదు.

నాకిప్పుడు తోడు కావాలన్న వాంఛ బలంగా పెరుగుతోంది. ప్రేమించేందుకు తీరుబడి లేదు. అవకాశమూ లేదు. (అసలు ప్రేమంటే ఏమిటి?) ఇంట్లో చెప్తే ఎవర్నయినా అమ్మాయిని చూస్తారు. కాని జీతం పెరగాలి. జీతానికీ జీవితానికీ ఒకే అక్షరం తేడా. అందువల్ల కాలం ఒంటరితనాన్ని అలవాటు చేస్తూ వచ్చింది.

ఇప్పుడు నేను నా గోడు మిత్రులకి వినిపించడం మానేశాను. అందరూ ఎవరి హడావుడిలో వాళ్ళు పడిపోయారు. అందరూ అన్నిటికీ అలవాటు పడ్తున్నారు.

అసలు కంచినాథం ఎవరికైనా గుర్తున్నాడా అని అనుమానం వచ్చి ఒక మిత్రుడిని కదిలించాను. "కంచినాథం అంటే, సిగరెట్‌ని నేలకేసి కొట్టి నలిపేసే వాడే అతనేనా?" ఎదురు ప్రశ్నవేశాడు. కంచినాథం స్మృతి అదొక్కటేనా?

ఇప్పుడు నాకు కూడా అదే అలవాటైంది. సిగరెట్‌ని నేలకేసి కొట్టి కాలితో కసిగా నలిపెయ్యడం. ఇంతకీ అసలు కంచినాథం వున్నాడా? అద్దంలో ఆదమరుపుగా నా మొహాన్ని నేనే చూసుకొని అలా భ్రమపడ్డానా?

—రాణి శివశంకర్